క్లుప్తంగా

పంచాయతీ కార్మికులపై వేధింపులు ఆపాలి



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

భానుపురి : క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని, వేతనాన్ని ప్రతినెలా నేరుగా కార్మికుడి అకౌంట్లో జమ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన గ్రామ పంచాయతీ కార్మికుల జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. మల్టీపర్పస్ విధానం పేరుతో కార్మికులతో అన్ని రకాల పనులు చేయించేలా గత ప్రభుత్వం జీఓ నంబర్ 51ను తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీనివాస్, నకరికంటి నరసయ్య, మంగయ్య, బక్కయ్య, నాగయ్య, శోభ, విజయ్ కుమార్, సోమయ్య, ఎల్లమ్మ, యాతాకుల వెంకన్న, విజయ్ కుమార్, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెవిటి వెంకన్నకు సన్మానం


హైదరాబాద్‌లో చెవిటి వెంకన్నను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

తిరుమలగిరి : రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడిగా శనివారం బాధ్యతలు స్వీకరించిన చెవిటి వెంకన్న యాదవ్‌ను రాఘవపురం, జేత్యా నాయక్ తండా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ చిరంజీవి నాయక్ హైదరాబాద్‌లో గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మాజీ జెడ్పీటీసీ బానోతు మాన్ సింగ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి పొందాలి

సూర్యాపేటటౌన్ : సూర్యాపేటలో దీపావళి టపాసులు అమ్మే వారు అనుమతి పొందాలని సూర్యాపేట డీఎస్పీ రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి తీసుకోకుండా టపాసులు అమ్మేవారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

సామాజిక సేవా సంఘం జేఏసీ అధ్యక్షుడిగా రాములు


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

ఆత్మకూర్ (ఎస్) : సామాజిక అఖిలపక్ష సేవా సంఘాల జేఏసీ మండల అధ్యక్షుడిగా గట్టికల్ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు భూపతి రాములు నియమితులయ్యారు. శనివారం మండల పరిధిలోని నెమ్మికల్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుడిగా, లీగల్ అడ్వైజర్‌గా దండా వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడిగా గంపల కృపాకర్, ప్రధాన కార్యదర్శిగా దొంతగాని కరుణాకర్, కోశాధికారిగా మేడి కృష్ణ, సాంస్కృతిక కార్యదర్శిగా గుండు వెంకన్న, అధికార ప్రతినిధులుగా భారీ అశోక్, పందిరి మాధవరెడ్డి, తగుళ్ల జనార్దన్ యాదవ్, నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భూపతి రాములు మాట్లాడుతూ మండల అభివృద్ధి సాధనగా ఈ జేఏసీ ఏర్పడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫయాజ్, కిరణ్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన కమిటీ సభ్యులు

తిరుమలగిరి : మాల మహానాడు గుండెపురి గ్రామ కమిటీ కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుడిగా మెడిద శ్రీను, గ్రామ శాఖ అధ్యక్షుడిగా నగేష్, ఉపాధ్యక్షులుగా అశోక్, ఎం.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా ఎం.శాంతయ్య, కార్యదర్శిగా భాగ్యయ్య, కోశాధికారిగా రమేష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మున్సిపాలిటీ అధ్యక్షుడు గంటా లక్ష్మణ్, గంటా సందీప్, మద్దెల ప్రభుదాస్, యాకూబ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం

తుంగతుర్తి : మండల పరిధిలోని మల్లన్న గుట్టను పేల్చేందుకు ఎలాంటి అనుమతులు, లైసెన్స్ లేకుండా వినియోగిస్తున్న ఐదు డిటోనేటర్స్, 27 జిలెటిన్ స్టిక్స్, వాటికి ఉపయోగించే వైరు, బ్యాటరీ కంప్రెసర్ ట్రాక్టర్‌ను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శీను తెలిపారు. కాశీతండాకు చెందిన షరీఫ్, శివరాత్రి విజయ్ కుమార్, వీరయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- వసతులు లేకపోవడంతో ఆసక్తి కనబరచని క్రీడాకారులు
- సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తేవాలని కోరుతున్న యువత

పెన్‌పహాడ్ : గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచి, వారిలో నైపుణ్యాన్ని వెలికి తీయాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కానీ వాటిలో సౌకర్యాలు కల్పించడంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించారని పలువురు ఆరోపిస్తున్నారు. ఫలితంగా క్రీడా ప్రాంగణాల పరిస్థితి ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. వీటి నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీలకు అప్పగించినప్పటికీ పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ఎందుకు అక్కరకు రాని స్థితికి చేరుకున్నాయి.

29 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు..

మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కానీ వాటిని మొక్కుబడిగా ఏర్పాటు చేసి వదిలేయడంతో ప్రస్తుతం నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై ప్రత్యేక దృష్టి సారించి సౌకర్యాలను కల్పించాలని, క్రీడాకారులను ప్రోత్సహించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.


సింగారెడ్డిపాలెంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

లక్షల రూపాయల్లో ఖర్చు..

గత ప్రభుత్వ హయాంలో క్రీడా ప్రాంగణాల నిర్మాణం, క్రీడా పరికరాలు, మౌలిక వసతుల కల్పనకు ఒక్కో ప్రాంగణానికి లక్షల రూపాయల్లో ఖర్చు చేశారు. క్రీడా ప్రాంగణాల్లో 23 రకాల క్రీడా పరికరాలను సమకూర్చినప్పటికీ సరిపడా సౌకర్యాలు లేకపోవడంతో అవన్నీ నిరుపయోగంగా మారాయి. పలుచోట్ల పూర్తిస్థాయిలో క్రీడాసామగ్రి అందజేయలేదు. దీంతోపాటు శిక్షకుల నియామకం ఇప్పటి వరకు జరగలేదు. ముఖ్యంగా క్రీడా ప్రాంగణాలకు చాలాచోట్ల ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. క్రీడా ప్రాంగణాల నిర్వహణను గ్రామ పంచాయతీలు పూర్తిగా విస్మరించాయన్న ఆరోపణలు ఉన్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో చెట్ల పొదలు, పిచ్చి మొక్కలకు నిలయంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేసి, వసతులు కల్పించి క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి

“క్రీడా ప్రాంగణాల్లో వసతులు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలి. ఆటలు ఆడుకునేందుకు స్థలాలు అనువుగా లేకపోవడంతో క్రీడాకారులు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. క్రీడా మైదానాలను వినియోగంలోకి తీసుకువచ్చి గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రోత్సహించాలి.

\- లింగయ్య, సింగారెడ్డిపాలెం

చదును చేయిస్తాం


“గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణాలను చదును చేయిస్తాం. వసతులు కల్పించి వినియోగంలోకి వచ్చేలా చూస్తాం. గ్రామీణ యువత వినియోగించుకునేలా ఆట వస్తువులు అందజేస్తాం.

\- వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ

ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన



మాట్లాడుతున్న షీ టీమ్ ఎస్ఐ నీలిమ

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు, యువతి, యువకులు ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని షీ టీం ఎస్ఐ నీలిమ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతీరావు పూలే పాఠశాలలో షీ టీమ్, సైబర్ నేరాల నియంత్రణపై షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు పోలీస్ కళాబృందంతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దన్నారు. గంజాయి, మత్తు మందులు ఎవరైనా వినియోగిస్తున్నట్లు తెలిస్తే తప్పకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. యువత లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి, షీ టీం ఏఎస్ఐ సాలయ్య, హెడ్ కానిస్టేబుల్ యల్లారెడ్డి, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, గురులింగం, క్రిష్ణ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


కంటి వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రవి

పెన్‌పహాడ్ : కంటి వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట డీఎస్పీ రవి అన్నారు. శనివారం నాగులపాటి అన్నారంలో ఐతబోయిన సావిత్రమ్మ-లింగయ్యల జ్ఞాపకార్థం గణేష్ యూత్ క్లబ్, లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాలు విద్య, వైద్యపరంగా అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. గ్రామాల్లో యువజన సంఘాలు స్వచ్ఛంద కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఐతబోయిన రాంబాబుగౌడ్, కలంచెర్ల సోదయ్య, లయన్స్ కంటి ఆస్పత్రి కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, మండల వైద్యాధికారి స్రవంతి, యగ్గడి మురళి, తీగల ఉపేందర్ రావు, రామినేని అప్పయ్య, యగ్గడి మధు, నకిరేకంటి వెంకన్న, సతీష్, శేఖర్, రమేష్, వెంకన్న, పురుషోత్తం, సత్యనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల నమూనా సేకరణ


తెగుళ్ల నమూనాలు సేకరిస్తున్న శాస్త్రవేత్తలు

పెన్‌పహాడ్ : లింగాల గ్రామంలో వివిధ రైతుల వరి పంటల్లో గోధుమ రంగు, ఆకుపచ్చ తెగులు, పాముపొడ తెగులు, మానిపండు తెగులు సోకిన నమూనాలను సేకరించినట్లు కేవీకే శాస్త్రవేత్త ఎ.కిరణ్ తెలిపారు. శనివారం ఎమర్జింగ్ డిసీజ్ (ఉద్భవిస్తున్న వ్యాధి) ప్రాజెక్టులో భాగంగా వరిలో తెగుళ్ల నమూనాలను సేకరించి మాట్లాడారు. ఐఆర్ఆర్ఐ సౌత్ ఆసియా హబ్, ఐసీఆర్ఐఎస్ఏటీ క్యాంపస్ హైదరాబాద్ సమన్వయంతో వివరాలను సేకరించినట్లు తెలిపారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో వ్యాధికారక సూక్ష్మజీవుల కారకాలు ఏ విధంగా ఉన్నాయో తెలుసుకోవడానికి నమూనాలు తోడ్పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ బ్రీడింగ్ శాస్త్రవేత్త శ్రీధర్, కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్త డి.ఆదర్శ్, ఐఆర్ఆర్ఐ సౌత్ ఆసియా హబ్ శాస్త్రవేత్త బాలరాజు, శుభం ప్రాజపతి, ఫామ్ అసిస్టెంట్ రాంరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో బస్ డిపో ఏర్పాటు చేయాలి


తిరుమలగిరిలో మాట్లాడుతున్న నాయకులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రంలో బస్ డిపో ఏర్పాటు చేయాలని బస్ డిపో సాధన కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం తిరుమలగిరిలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్ డిపో సాధన కమిటీ కన్వీనర్ కడెం లింగయ్య మాట్లాడారు. డిపో ఏర్పాటు చేయాలని గత రెండు నెలలుగా ప్రజాప్రతినిధులకు, కలెక్టర్‌కు, స్థానిక శాసన సభ్యుడికి వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. బస్ డిపో ఏర్పాటు చేయడం వల్ల వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని అన్నారు. అధికారులు స్పందించి బస్ డిపో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే.పాషా, సీహెచ్.హన్మంతు, వేల్పుల లింగయ్య, కొండా సోమయ్య, చిలుకల రమేష్, నలుగూరి రమేష్, కందుకూరి కొండయ్య, కొత్తగట్టు యాదయ్య, జక్కుల రమేష్, లింగయ్య, రాజు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట నిరసన


నిరసన తెలుపుతున్న మహిళలు

తుంగతుర్తి : మహిళా సంఘం డబ్బులను సంఘబంధం అధ్యక్షురాలు విజయలక్ష్మి తన సొంతానికి వాడుకొని తమకు ఇవ్వడం లేదని సంఘం బంధం సభ్యులు శనివారం వెలుగు కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమకు 2021-2022 సంవత్సరానికి సంబంధించి ఐకేపీలో వరి ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నుంచి రూ.4,15,000 కమిషన్ వచ్చిందని తెలిపారు. అయితే వాటిలో నుంచి రెండు లక్షల పదిహేను వేల రూపాయలను తమకు పంచకుండా సంఘ బంధం అధ్యక్షురాలు ఇబ్బందులు పెడుతుందని అన్నారు. అనంతరం తమ డబ్బులను ఇప్పించాలని కోరుతూ ఏపీఎం రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వినోద, ముత్తమ్మ, ధనమ్మ, ఉమ, యాకమ్మ పాల్గొన్నారు.

ఏఈఓల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక


నూతన కమిటీ ఎన్నికలో పాల్గొన్న ఏఈఓలు

చివ్వెంల : మండల పరిధిలోని గుంపుల తిరుమలగిరి గ్రామంలో శనివారం ఏఈఓల సంఘం జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఏఈఓల జేఏసీ చైర్మన్‌గా బుసి గంపల జానయ్య, కన్వీనర్‌గా ఆతుకూరి ఉప్పయ్య, కోశాధికారిగా షేక్ పర్వీన్, కో కన్వీనర్లుగా నేరేళ్ల సత్యం, సృజన, లక్ష్మి, అనూష, కోడి మురళి, బుడిగం చంద్రశేఖర్, కందుల ఝాన్సీ, ధరావతు మనోజ్ కుమార్, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల క్లస్టర్ల ఏఈఓలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


మద్దిరాల : ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్

అర్వపల్లి : అడివెంలలో ఎన్‌డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం గిర్దావర్ పాటి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నేరెళ్ల సత్యం, సెంటర్ ఇన్‌చార్జ్ ఆవుల విక్రం, పిట్టల సైదులు, మేడెబోయిన యాదయ్య, కొమ్మనబోయిన వెంకన్న, ఎడ్ల సైదులు, మచ్చ లింగయ్య, పిట్టల జాని, బోయపల్లి రవి, బంటు యాదగిరి, ఎం.ప్రవీణ్, కలకోట్ల శైలేందర్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

నూతనకల్ : రైతులు కొనుగోలు కేంద్రాలకు ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం నూతనకల్, ఎర్రపహాడ్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సునీత పాల్గొన్నారు.

మద్దిరాల : రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యానారాయణరెడ్డి, ఏపీఎం మైసయ్య, సీసీ నాగార్జున్‌రెడ్డి, మధు, బత్తుల పెద్ద వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


నూతనకల్ : కొనుగోలు కేంద్రంలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు


అర్వపల్లి : అడివెంలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకట్‌రెడ్డి

రక్తదానం చేయడం అభినందనీయం

నూతనకల్ : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో మండల పరిధిలోని మిర్యాల, బిక్కుమళ్ల, వెంకెపల్లి గ్రామాలకు చెందిన 25మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా తుంగతుర్తి సీఐ శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ పరిశీలన


తిరుమలగిరిలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ సుధీర్, ఈఈ నవీన్

తిరుమలగిరి : జనగామ జిల్లా పాలకుర్తి మండలం చెన్నూరు రిజర్వాయర్ నుంచి తిరుమలగిరి మండలంలో తాటిపాముల, నందాపురం, తిరుమలగిరి, అనంతారం గ్రామాలకు కాల్వల ద్వారా నీరు రావడానికి భూ సేకరణ పనులను ఇరిగేషన్ ఎస్ఈ సుధీర్, ఈఈ నవీన్, జేఈ విద్యాసాగర్ శనివారం పరిశీలించారు. చెన్నూరు రిజర్వాయర్ నుంచి లక్ష్మక్కపల్లి, రామన్నగూడెం, మొండ్రాయి, తాటిపాముల, నందాపురం, తిరుమలగిరి గ్రామాల్లోని చెరువులలోకి నీళ్లు రావడానికి సర్వే నిర్వహించారు. వేసవిలో రైతులకు తాగు, సాగు నీటి ఎద్దడి రాకుండా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎర్ర యాదగిరి, బోయినపల్లి కిషన్, చెరుకు సోమయ్య, రమేష్, మల్లేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దూదిగామ వీరయ్య ఇటీవల మృతిచెందారు. దీంతో మృతుడి కుటుంబానికి శనివారం డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, గ్రామశాఖ అధ్యక్షుడు కుంటిగొర్ల శ్రీనివాస్, బాషపోలు శ్రీనివాస్, బౌరోజు ఉపేందర్, శ్రీను, గుట్టయ్య, కృష్ణ, బన్వరి ఉపేందర్, ప్రశాంత్, సతీష్, మహేష్, నవీన్, సాయి, వెంకన్న, ఉపేందర్, జలేందర్ పాల్గొన్నారు.

నేడు మూసీ పరీవాహక రైతుల సమ్మేళనం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అర్వపల్లి : మూసీ ప్రక్షాళనకు మద్దతు తెలుపుతూ ఆదివారం అడ్డగూడూరు మండలం మానాయికుంట మూసీ బ్రిడ్జిపై నిర్వహించే నియోజకవర్గ స్థాయి మూసీ పరీవాహక రైతుల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధుకర్‌రెడ్డి కోరారు. శనివారం అర్వపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని, రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, దిర్శనపు కృష్ణమూర్తి, బైరబోయిన సైదులు, బద్దం యాదగిరి, పోలోజు మధు, కొమారి మల్లయ్య, రవి, ప్రవీణ్, మాదగాని విక్రం, నిమ్మల నిరంజన్, కుమార్, సైదుల కిరణ్, సర్దార్, మరిపెల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మానాయికుంట సభను జయప్రదం చేయండి

నాగారం : మూసీ ప్రక్షాళనను సమర్థిస్తూ అడ్డగూడూరు మండలం మానాయికుంటలో ఆదివారం నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సోమయ్య అన్నారు. నాగారం మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలకు ఉపయోగపడే మూసీ ప్రక్షాళన ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ కార్యదర్శి షేక్ వలీ, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రయోగాత్మక బోధన


విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరిస్తున్న సువెన్ ఫార్మా కంపెనీ సిబ్బంది

పెన్‌పహాడ్ : అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్, సువెన్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా అందించే సైన్స్ బోధనలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం నర్సయ్య అన్నారు. శనివారం దోసపహాడ్ గ్రామంలోని యూపీఎస్‌లో నిర్వహించిన సైన్స్ ప్రయోగాలను ఉద్దేశించి మాట్లాడారు. సైన్స్ అనేది ప్రకృతి నియమాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగించే పద్ధతి అని అన్నారు. సైన్స్‌కు చెందిన అంశాలపై సువెన్ సంస్థ సిబ్బంది ప్రయోగాల ద్వారా విద్యార్థులకు వివరించడం అభిందనీయమన్నారు. కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులు మామిడి వెంకన్న, ఆర్. వెంకటేశ్వర్లు, విప్లవకుమార్, సంస్థ సిబ్బంది మామిడి వెంకటేశ్వర్లు, స్వరూప, గురువయ్య పాల్గొన్నారు.

• వెంపటి పాఠశాలలో రెడ్ కలర్ డే


తుంగతుర్తి : వెంపటి పాఠశాలలో శనివారం రెడ్ కలర్ డే నిర్వహించారు. విద్యార్థులు ఎరుపు రంగు వేషధారణలో ఆకట్టుకున్నారు. ఎరుపు రంగు వస్తువులను ప్రదర్శించారు.

నిత్యావసరాల ధరలు నియంత్రించాలని వినతి


తుంగతుర్తిలో తహసీల్దార్ దయానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తుంగతుర్తి : దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలను నియంత్రించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరి రావు అన్నారు. శనివారం కేంద్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ దయానంద్‌కు వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిత్యావసరాల ధరలను నియంత్రించడంతో విఫలమైందని తెలిపారు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, నంద్యాల శంకర్ రెడ్డి, మండల కమిటీ సభ్యులు పల్లా సుదర్శన్, విష్ణుమూర్తి, ముత్తయ్య, దేవరాజ్, సావిత్ర పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషిచేయాలి


అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో డ్రగ్స్ నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

అర్వపల్లి : మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు వి. శ్రీదేవి కోరారు. శనివారం స్థానిక పాఠశాల ఆవరణలో మాదక ద్రవ్యాల నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఎవరైనా అక్రమంగా డ్రగ్స్ విక్రయించినా, సేవించినా వెంటనే 1908 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఎవరికి వారు తమ వంతు బాధ్యతగా డ్రగ్స్ నిర్మూలనకు సహకరించాలని కోరారు. డ్రగ్స్ రహిత తెలంగాణ రాష్ట్రం కోసం కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డ్రగ్స్ నిర్మూలన కోఆర్డినేటర్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.మల్లేష్, ఉపాధ్యాయులు వి.మధుకర్, విమల, రమేష్, శ్రీరాములు, ప్రసన్న, వీరన్న, ప్రశాంతి, శోభ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ‘ఇందిరా మహిళాశక్తి’

కోదాడరూరల్ : పేదరిక నిర్మూలనకు ఇందిరా మహిళాశక్తి పథకం వరమని మెప్మా స్టేట్ మిషన్ కోఆర్డినేటర్ ప్రసన్న కుమార్ అన్నారు. శనివారం కోదాడ పట్టణం నయానగర్‌లోని శ్రీరామ్‌నగర్ ఎస్ఎల్ఎఫ్-1 సమాఖ్య సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వగృహ హోమ్ ఫుడ్స్ తయారీని వారు పరిశీలించి మాట్లాడారు. స్వయం ఉపాధి పొందే మహిళా సంఘాలకు శ్రీనిధి ద్వారా ప్రభుత్వం రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు రుణాలు అందజేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమాదేవి, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ కాసం రేణుక, సీఈఓ సాయికృష్ణ, సీఎల్ఆర్పీలు రాణి, విజయరాణి, జ్యోతి, మమత, శ్రీరామ్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా

మద్దిరాల : మండల పరిధిలోని జి.కొత్తపల్లి గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నిషేధం, గంజాయి నియంత్రణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బొబ్బిలి వెంకన్న, వెంకటేశ్వర్లు, బాలరాజు, కళాబృందం సభ్యులు ఈర్ల సైదులు, వెన్నెల నాగరాజు, మాగి శంకర్, గద్దం ఉదయ్, మేడిపల్లి వేణు, పాలకుర్తి శ్రీకాంత్, ఉపేందర్, గజ్జి మంజుల, నెమ్మాది స్రవంతి, పోతరాజు శిరీషా, సిరిపంగి రాధ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని గెలిపించాలని ప్రచారం


కాసర్లపహాడ్ జెడ్పీహెచ్ఎస్‌లో కరపత్రాలతో ప్రచారం చేస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

అర్వపల్లి : ఎమ్మెల్సీగా టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని రెండోసారి గెలిపించాలని ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి నోముల వెంకటేశ్వర్లు కోరారు. శనివారం కాసర్లపహాడ్ జెడ్పీహెచ్ఎస్‌తోపాటు వివిధ పాఠశాలల్లో టీఎస్ యూటీఫ్ ఆధ్వర్యంలో కరపత్రాలు, స్టిక్కర్లు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీగా నర్సిరెడ్డి విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషిచేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి శేఖర్, సంఘం నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, జటంగి నాగయ్య, వీరన్న, నిర్మల, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.